రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని నెహ్రూ యువ కేంద్రంలో ఈనెల 21వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి కొత్తలంక రాధ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్‌లో బిడిఎం ఉద్యోగాలు, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లోన్ ఆఫీసర్, హెల్త్‌కేర్‌లో బిసిజి బెడ్‌సైడ్ కేర్ టేకర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సర్టిఫికేట్లతో పాటు ఆధార్, బయోడేటాతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. ముందుగా www.ncs.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శివారు భూములకు సాగునీరు

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు



నందిగాం : వంశధార కాలువను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - నందిగాం, పలాస

ఖరీఫ్ సీజన్‌లో శివారు భూములకు సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వంశధార అధికారులను ఆదేశించారు. నందిగాం మండలంలోని గొల్లూరు వద్ద, పలాస మండలంలోని మోదుగులపుట్టి వద్ద వంశధార ఎడమ ప్రధాన కాలువను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార కాలువలో పూడికతీత పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలువలో మేజర్ మరమ్మతులు ఉంటే తాత్కాలిక పనులు చేపట్టి ఈ ఏడాది శివారు భూములకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కాలువలో ఉన్న అన్ని లిప్టులను పనిచేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాదికి వంశధార కాలువలో సిమెంట్ లైనింగ్ వేస్తామని హామీనిచ్చారు. సోదాం ఎత్తిపోతల పథకం వద్ద విద్యుత్ పరికరాలను దొంగిలించిన వారిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారని తెలిపారు. గొల్లూరు-రాంపురం రహదారిపై వంశధార కాలువపై ఉన్న వంతెన గతేడాది కూలిపోవడంతో, కాలిబాటను మాత్రమే ఏర్పాటు చేయడాన్ని గుర్తించిన మంత్రి, వంతెన నిర్మించాలని డిఇ శేఖర్‌రావును ఆదేశించారు.

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులపై ఆరా తీశారు. త్వరలోనే రిజర్వాయర్ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు. మత్స్యకారులకు అవసరమైన కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వంశధార ఇఇ శేఖర్, టిడిపి నాయకులు వజ్జ బాబూరావు లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, పి.అజయ్ కుమార్, బాలకృష్ణ, పి.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం

నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు



ఆటోపై విరిగిపడిన చెట్టు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. బలంగా వీచిన ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. చిల్లర వర్తకులకు చెందిన దుకాణాలు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలపై చెట్లు పడడంతో అవి దెబ్బతిన్నాయి. 11 విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇచ్ఛాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిక సమస్యలతో మూడు రోజులుగా విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపడడంతో అది రెట్టింపు అయింది. బుధవారం ఉదయం రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్లను తొలగించారు. విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.




కారుపై పడిన చెట్టు



- వరికి క్వింటాకు రూ.117 మద్దతు ధర పెంపు
- గతేడాది పోలిస్తే రూ.26 తక్కువ
- పెరిగిన వ్యవసాయ ఇన్‌పుట్స్ ధరలు
- తడిసిమోపడవుతున్న పంట ఖర్చులు
- కేంద్రం మద్దతు ధరపై అన్నదాతల పెదవివిరుపు

ఇదేం 'మద్దతు'..?

కేంద్ర ప్రభుత్వం ఒకవైపు ఎరువులు, విత్తనాలపై రాయితీ క్రమేణా ఎత్తేస్తోంది. మరోవైపు పెట్రోల్ రేటు సెంచరీ ఎప్పుడో దాటగా, డీజిల్ ధర వందకు సమీపంలో ఉంది. పంట కాలంలో వినియోగిస్తున్న యంత్రాల అద్దెలూ పెరిగాయి. రైతులపై పలురూపాల్లో భారం మోపుతున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, పంటల మద్దతు ధర విషయానికి వచ్చేసరికి పెంచడానికి చేతులు రావడం లేదు. వరికి క్వింటాకు రూ.117 మాత్రమే పెంచి చేతులు దులుపుకుంది. గతేడాది రూ.143 పెంచగా, ఈసారి రూ.26 తగ్గించి ధర ప్రకటించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట ఖర్చులు పెరిగిన నేపథ్యంలో మద్దతు ధరపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులను తీవ్ర నిరాశకు గురి చేసింది.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వరి ప్రధాన పంటగా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి మొత్తం 5.59 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఖరీఫ్‌లో 5,09,238 ఎకరాల్లో, రబీలో 50 వేల ఎకరాల్లో వరి పంట పండిస్తున్నారు. రెండు సీజన్లలో కలిపి మొత్తం 12 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వస్తోంది. రైతుల సొంత అవసరాలకు పోనూ పది లక్షల టన్నులకు పైగా ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు అమ్ముతున్నారు. 2023 ఖరీఫ్ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం వరికి క్వింటాకు రూ.143 పెంచడంతో సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్-ఎ రకానికి రూ.2,203 పెరిగింది. ప్రస్తుతం రూ.117 పెంచడంతో సాధారణ రకానికి రూ.2.300, గ్రేడ్-ఎ రకానికి రూ.2,320 దక్కనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై రైతులు పెదవివిరుస్తున్నారు. పంట ఖర్చులు విపరీతంగా పెరిగిన తరుణంలో ఇది ఏ మూలకు సరిపోతుందని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

పెరిగిన పంట ఖర్చులు

గతేడాదితో పోలిస్తే పంట ఖర్చులు విపరీతంగా పెరిగాయి. గత ఖరీఫ్ సీజన్‌లో దుక్కులకు రూ.6.500 ఉంటే, ప్రస్తుతం రూ.ఏడు వేల వరకు చెల్లించాల్సి ఉంటుందని రైతులు చెప్తున్నారు. పురుగు మందుల కోసం గతేడాది రూ.2,500 ఖర్చు చేయగా, ప్రస్తుత సంవత్సరంలో రూ.మూడు వేల వరకు పెరిగింది. ఉబాల కోసం గత ఖరీఫ్‌లో రూ.7,500 వేలు ఖర్చు చేయగా, ఇప్పుడు రూ.ఎనిమిది వేలు దాటుతుందని రైతులు చెప్పున్నారు. పరేరా కంపెనీకి చెందిన గులికలు గతేడాది రూ.2,200 ఉండగా, ప్రస్తుతం రూ.2,400 చేరింది. పెట్రోల్ సెంచరీ దాటగా, డీజిల్ ధరలు సెంచరీకి సమీపంలో ఉంది. ప్రస్తుతం లీటరు పెట్రోల్ రూ.110.68 ఉండగా డీజిల్ రూ. 98.39 ఉంది. గతేడాదితో పోలిస్తే పెట్రోల్, డీజిల్ ధరల్లో పెద్దగా మార్పులు లేకపోయినా పంట కాలంలో వినియోగిస్తున్న యంత్రాల అద్దెలు పెరిగాయి. వర్షాలు కురిస్తే ఈ ఖర్చులు ఉంటాయి. గతేడాది మాదిరి తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమైతే, ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. పొలాలకు నీరు పెట్టేందుకు వినియోగించే ఇంజిన్ల అద్దె పెరిగే అవకాశాలూ లేకపోలేదు. కోత మిషన్ అద్దె, పొలం నుంచి ఇళ్లకు ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్ల అద్దెలూ పెరగనున్నాయి. రూ.5,500 నుంచి రూ.6,500 వరకు ఉంటుందని రైతులు చెప్తున్నారు. చివరకు ఇళ్ల ధాన్యం తెచ్చుకునేందుకు గతేడాది రూ.300 చెల్లించగా, ఇప్పుడు అదనంగా మరో రూ.50 చెల్లించాల్సి ఉంటుందని చెప్తున్నారు. మొత్తమ్మీద ఈ ఏడాది అదనంగా రూ.ఐదు వేలు ఖర్చవుతుందని రైతులు అంచనా వేస్తున్నారు.

ఐదేళ్లలో మద్దతు ధర వివరాలు

సంవత్సరం	పెంపు (రూ.లో)	సాధారణ రకం వరి క్వింటాకు (రూ.లో)
2020-21	53	1868
2021-22	72	1940
2022-23	100	2,040
2023-24	143	2,183
2024-25	117	2,300

రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు కాదు



కేంద్ర ప్రభుత్వం చాలా నామమాత్రంగానే మద్దతు ధర ప్రకటించింది. వ్యవసాయ ఇన్‌పుట్స్ ధరలను ప్రతి ఏడాదీ 30 నుంచి 40 శాతం పెరుగుతున్నాయి. మద్దతు ధర పెంచామని చెప్పుకోవడానికే కేంద్రం పెంచిందే తప్ప రైతులకు ఇది ఏమాత్రం గిట్టుబాటు కాదు. ఢిల్లీలో రైతుల ఆందోళనల తర్వాత పంటలకు గ్యారంటీ మద్దతు ధర చట్టం చేస్తామని మోడీ హామీనిచ్చినా, ఇప్పటివరకు అమలు చేయకపోవడం రైతులపై కేంద్రం చిత్తశుద్ధిని తెలియజేస్తోంది.

- కె.మోహనరావు, జిల్లా కార్యదర్శి, ఎపి రైతుసంఘం

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు

ఐఆర్‌సిటిసి ఆర్‌ఎం క్రాంతి పి.సావర్కర్



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సిటిసి అధికారులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

దేశంలోని ప్రముఖ ఆలయాలు, పర్యాటక కేంద్రాల సందర్శనకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ సంస్థ (ఐఆర్‌సిటిసి) ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఆ సంస్థ రీజనల్ మేనేజర్ క్రాంతి పి.సావర్కర్ తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లోని విఐపి లాంజ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆలయాల సందర్శనకు భారత్ గౌరవ యాత్ర పేరుతో ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు తెలిపారు. పూరీ, గయ, వారణాసి, అయోధ్య, ప్రయోగరాజ్ తదితర క్షేత్రాల సందర్శనకు తొమ్మిది రాత్రులు, పది రోజుల ప్రయాణానికి ఎకానమీలో పెద్దలకు ఒక్కొక్కరికి రూ.16,525, ఐదు నుంచి 11 ఏళ్ల లోపు పిల్లలకు రూ.15,410, స్టాండర్డ్‌లో పెద్దలకు రూ.25,980, పిల్లలకు 24,670, కంఫర్ట్‌లో పెద్దలకు 33,955, పిల్లలకు 32,380 ఛార్జీ ఉంటుందని వివరించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారంతో పాటు వసతి, ఆలయాల సందర్శనలకు ప్రత్యేక గైడ్లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ రైళ్లలో స్లీపర్ క్లాస్, థర్డ్ ఎసి, సెకండ్ క్లాస్ ఎసి బోగీల ద్వారా 716 మంది ప్రయాణికులు ప్రయాణిస్తారని తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్‌లో బయలుదేరి కాజీపేట, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, విశాఖపట్నం, విజయనగరం రైల్వేస్టేషన్లలో బోర్డింగ్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఈ రైలు జూలై 9వ తేదీన బయలుదేరి పుణ్యక్షేత్రాల సందర్శన ముగించుకుని 17వ తేదీకి తిరిగి చేరుతుందని తెలిపారు. పర్యాటక ప్రాంతాల సందర్శనకు మానస్కండ్ యాత్ర భారత్ గౌరవ్ టూరిస్ట్ పేరిట మరో రైలు వేసినట్లు తెలిపారు. బీమటాల్, నైనిటాల్, కైంచిధామ్, కాసర్‌దేవి, కాటన్ మాల్ సన్ టెంపుల్, జాగేశ్వర్‌దాం, ఆల్మోరా, బైజనాథ్, బాగేశ్వర్, కౌసాని, రాణిఖేట్ తదితర ప్రదేశాలను చూపించనున్నట్లు చెప్పారు. ఈ రైలు జూలై 26వ తేదీన విశాఖపట్నంలో బయలుదేరి ఆగస్టు 5వ తేదీకి తిరిగి చేరుతుందని తెలిపారు. పది రాత్రులు, 11 రోజుల ప్రయాణానికి స్టాండర్డ్‌లో పెద్దలకు రూ.28,020, డీలక్స్‌లో పెద్దలకు రూ.35,340 పిల్లలకు 35,140 ఛార్జీలు ఉంటాయన్నారు. తిరుపతి దర్శనానికి రూ.300 దర్శన టిక్కెట్‌తో రెండు రాత్రులు, మూడు రోజుల ప్రత్యేక ప్యాకేజీ అందుబాటులో ఉందని తెలిపారు. ప్రారంభ టిక్కెట్ ధర 17,730 అని అన్నారు. దేశ, విదేశాల్లోని పర్యాటక కేంద్రాల సందర్శనకు ఎయిర్ ప్యాకేజీలనూ రూపొందించామన్నారు. ఆలయ, పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలనుకునే వారు ఆన్‌లైన్‌లో గానీ, రైల్వే బుకింగ్ కౌంటర్లలో గానీ, శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లోని రెండో నంబరు ప్లాట్‌ఫారంపై జన ఆహార్ స్టాల్ వద్ద ఐఆర్‌సిటిసి ప్రతినిధి వద్ద గానీ టిక్కెట్లను బుక్ చేసుకునే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు www.irctctourism.com వెబ్‌సైట్‌ను గానీ, 8287932318, 9281495847 ఫోన్ నంబర్లను గానీ సంప్రదించాలని కోరారు. సమావేశంలో ఐఆర్‌సిటిసి ఎగ్జిక్యూటివ్ సంఘమిత్రరావు, రైల్వేస్టేషన్ మాస్టర్ ఎం.రవి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్ పాల్గొన్నారు.



ఎస్‌పికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఇబి ఎఇఎస్ వినీష

ఎస్ఇబి ఎఇఎస్‌గా వినీష

ప్రజాశక్తి - శ్రీకాకుళం

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎం.వినీష నియమితులయ్యారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్ రాధికను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఆరుగురికి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

ఇటీవల విశాఖపట్నం రేంజ్ పరిధిలో పలువురు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లకు రేంజ్ డిఐజి విశాల్ గున్ని ఎస్ఐలుగా ఉద్యోగోన్నతులు కల్పించారు. ఇందులో భాగంగా జిల్లాలో ఆరుగురు ఎఎస్ఐలకు ఎస్ఐలుగా అవకాశం లభించింది. వీరిలో ముగ్గురికి జిల్లాలో, మరో ముగ్గురికి రేంజ్ పరిధిలో ఎస్ఐలుగా కేటాయించారు. జిల్లాకు కేటాయించిన ఎస్ఐలు పి.ఢిల్లీరావు, పి.వి రమణ, కె.శివాజీ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి జి.ఆర్ రాధికను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఎస్‌పి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగోన్నతి ఉద్యోగులకు మరింత బాధ్యత పెంచుతుందని, విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమ్ కాజల్ ఉన్నారు.

అభివృద్ధికి ఆటంకం కలిగిస్తే తోక కత్తిరిస్తా..!

ఎమ్మెల్యే గౌతు శిరీష



సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎవరైనా మున్సిపాలిటీలో గొడవలు సృష్టించి, అభివృద్ధికి ఆటంకాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే వారి తోక కత్తిరిస్తానని హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత పాలకులు మున్సిపల్ చైర్మన్‌కు ఉన్న అధికారం, స్వేచ్ఛను సైతం తీసుకున్నారని, అటువంటి తప్పును తాను చేయబోనన్నారు. ప్రజాప్రతినిధులుగా ఎవరి పరిపాలన వారు చేసుకోవచ్చని చెప్పారు. కౌన్సిలర్లు ప్రభుత్వానికి సహకరిస్తే మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలోని ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు ఎందుకు సరఫరా చేయలేకపోతున్నారని అధికారులను ప్రశ్నించారు. ఐదేళ్లుగా మంచినీటి కోసం ఎంత నిధులు వెచ్చించారు? ప్రభుత్వం నుంచి ఎంత మంజూరైందని ఆరా తీశారు. మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ బోర్లు, బావుల్లోని నీరు అడుగంటిపోవడంతో ఆరు రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నామని చెప్పారు. కేదారిపురం ట్యాంకు నుంచి పైపులైన్ ఇస్తే మంచినీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మూడు నెలల్లో మున్సిపాలిటీలో పారిశుధ్యం, తాగునీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బోర బుజ్జి, మీసాల సురేష్‌బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, తులసి, మున్సిపల్ అధికారులు కనకరాజు, ఎఇ అవినాష్, అప్పలస్వామి, అమర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై ఉక్కుపాదం

- బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే చర్యలు
- కంకర, మట్టి తరలింపుపై ప్రత్యేక దృష్టి
- ఆర్‌డిఒ భరత్ నాయక్



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి - పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపి, వాటిని వెంటనే తొలగించాలని పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం తహశీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ అధికారులతో బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదేనని స్పష్టం చేశారు. దేవాదాయ, ఇతర భూముల ఆక్రమణలపై సర్వే చేసి, వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. అనుమతుల్లేకుండా కంకర, మట్టి, సముద్ర ఇసుక తవ్వకాలు, తరలింపులకు ఎవరు పాల్పడినా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. పలాసలో హుదూద్, టిడ్కో ఇళ్లు, ఎఫ్‌సిఐ గోదామును పరిశీలించారు. గోదాము రికార్డులను పరిశీలించారు. హుదూద్ ఇళ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వజ్రపుకొత్తూరులో బెండికొండ వద్ద హుదూద్ ఇళ్లను పరిశీలించారు. వినియోగంలో లేకపోవడం వల్ల అనేక ఇళ్లు శిథిలస్థితికి చేరినట్లు గుర్తించారు. నందిగాంలో నర్సిపురం వద్ద ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్లు ఎస్.ఎస్.వి.ఎస్ నాయుడు, ఎం.సురేష్, వి.పద్మావతి, డిటిలు రాజశేఖర్, వి.గిరిరాజ్, కె.భాగ్యలక్ష్మి, ఆర్ఐలు నిరంజన్, పవిత్ర, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రతి గ్రామానికీ తాగునీరు

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస
ప్రతి గ్రామానికీ తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గౌతు శిరీష ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా ప్రాంతాలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని తన దృష్టికి వచ్చిందన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే సిసి, తారు రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా ఎటువంటి ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణకుమార్, దువ్వాడ శ్రీకాంత్, బి.నాగరాజు, డొక్కరి శంకర్, పంచాయతీరాజ్ డిఇలు రామకృష్ణ, రవిబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ దుర్యోధన, ఎఇలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషకు సన్మానం
టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే శిరీషను ఎపి ఎన్‌జిఒల సంఘం నాయకులు, రెంటికోట ఆస్పత్రి వైద్యులు, వజ్రపుకొత్తూరు మండల మహిళలు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ సంఘం అధ్యక్షుడు బోనెల గోపాల్, వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారి పాపారావు, రెంటికోట పిహెచ్‌సి వైద్యాధికారులు సునీల్, మానిక సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఎస్.రామారావు, త్రివేణి, రోజా, ఉదయ శంకర్ పాత్రో, రిషికేశ్వరరావు, శ్రీనివాసరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు

లావేరు: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. లావేరు పిహెచ్‌సిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందజేయాలని సూచించారు. ఈ మేరకు పిహెచ్‌సిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని విభాగాలను పరిశీలించి వైద్యాధికారిని మణిభూషణ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో పాము, తేలు, కుక్కకాటు ఇంజెక్షన్లు అందుబాటులో ఉండాలన్నారు. గర్భిణులు పిహెచ్‌సిలోనే ప్రసవాలు జరిగేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి ఎం.వెంకటరమణ, ముప్పిడి మురళి, మీసాల లక్ష్మణనాయుడు, బి.కోటీశ్వరరావు పాల్గొన్నారు.

రామోజీరావుకి నివాళి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో చిన్ని కిడ్స్ స్కూల్ డైరెక్టర్ పూడి సుష్మ (చిన్ని) ఆధ్వర్యంలో ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్రికా రంగంలో మేరునగధీరుడు, జర్నలిజానికి వన్నె తెచ్చిన మహా మనిషి అన్నారు. వి.శంకరరావు, ప్రిన్సిపాల్, డాక్టర్ టి.శిల్ప, ప్రభుత్వ చిన్న పిల్లల వైద్యులు శ్రీకన్య, కూన విష్ణుమూర్తి, ప్రభుత్వ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డాక్టర్ పూడి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- లావేరు
స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావులు రైతులకు వరి విత్తనాలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతుల కోసం నిరంతరం పనిచేస్తారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయని వాఖ్యానించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జెడి శ్రీధర్, టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, మాజీ ఎంపిపి ఎం.వెంకటరమణ, పి.మధుబాబు పాల్గొన్నారు.

పలాస : ఖరీఫ్ సీజన్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు న్యాయం చేస్తామని, విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని చినబడాంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన రైతులకు బుధవారం విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి రైతుకూ ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు, ఎరువులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రైతులకు సేవలు అందించేందుకు అధికారులతో పాటు తానూ సిద్ధంగా ఉన్నానని చెప్పారు. నియోజకవర్గంలో 3163 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని, మందస మండలం సబ్‌ప్లాన్ మండలంగా ఎంపిక కావడంతో గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై 560 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వాటిని గిరిజనులకు పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, దువ్వాడ శ్రీకాంత్, సూరడ మోహనరావు, వ్యవసాయశాఖ ఎడిఎ ఎల్.మధుసూదనరావు, ఎఒలు పోలారావు, నాగరాజు, ఎఇఒ పాపారావు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బ్రాహ్మణతర్ల, లక్ష్మీపురం గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధర్యాన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దువ్వాడ సంతోష్‌కుమార్ నాయుడు, దువ్వాడ శ్రీహర్ష, ఆళ్ల వెంకటరావు, వడ్డి యాదగిరి ఉన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని మేఘవరం సచివాలయంలో మాజీ సర్పంచ్ పరపటి రాజశేఖర్‌రెడ్డి, మరువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజు, దీర్ఘాశి జయరామ్‌రెడ్డి, సూరాడ రాయుడు, యంపల్ల జోగారావు, నందుపల్లి రామారావు, సిరిగిడి కొండలరావు, వంక సోమేశ్వరరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎల్.సుప్రియ పాల్గొన్నారు.


పొందూరు : విత్తనాలను పంపిణీ చేస్తున్న నాయకులు

పొందూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ప్రతి రైతుకూ సకాలంలో వరి విత్తనాలను అందజేయాలని టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ అధికారులకు తెలిపారు. పొందూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణంలో బుధవారం రైతులకు వరి విత్తనాల పంపిణీ చేశారు. మండలంలో 5,262 మంది రైతులకు 848 క్వింటాళ్ల వరి విత్తనాలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎడిఎ ఎ.శ్రీనివాసరావు, మండల ఎఒ బెండి బాబ్జీలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, అన్నెపు రాము, అనకాపల్లి చిన్నరంగా, బలగ శంకరభాస్కరరావు, బాడాన శేషగిరి, వండాన మురళి, గాడు నారాయణరావు, బొడ్డేపల్లి సత్యం, ముగడ తవిటినాయుడు, సుమంత్ పాల్గొన్నారు.


లావేరు : విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ రైతు భరోసా కేంద్రం వద్ద సర్పంచ్ ప్రతినిధి పిలక రవికుమార్‌రెడ్డి, టిడిపి నాయకులు శాంతి స్వరూప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కర్రి విష్ణుమూర్తి, వాడరేవు కృష్ణలు వరి విత్తనాలను పంపిణీ చేశారు.

నందిగాం : నందిగాం ఆర్‌బికె వద్ద పిఎసిఎస్ అధ్యక్షులు పి.అజయ్‌కుమార్, నీటి సంఘం మాజీ అధ్యక్షులు కె.ప్రసాదరావు, పోలాకి చంద్రశేఖరరావు, బాలకృష్ణలు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఎఒ శ్రీకాంత్‌వర్మ, విఎఎ డి.అరవింద్ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మడలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, ఎంపిటిసి కింజరాపు లలితకుమారి రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు, మండల ఎఒ ఎస్.గోవిందరావు, వ్యవసాయ సహాయకులు ఎస్.శివకుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని కొర్లకోటలో టిడిపి మండల నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావులు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తమ్మినేని విద్యాసాగర్, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, సర్పంచ్ సనపల చెల్లంనాయుడు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతోనే చైతన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్
కక్షిదారుల మధ్య ప్రతికూల పరిస్థితులు నుంచి అనుకూల పరిస్థితులు మార్చగలిగే శక్తి ఒక్క మధ్యవర్తికే సాధ్యమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం, సంధి ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యాన జిల్లా కోర్టు ప్రాంగణంలో మధ్యవర్తిత్వంపై బుధవారం రెండో శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వ భావన, సాంకేతికతలపై 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ ఉంటుందన్నారు. అందులో మొదట కక్షిదారులు చెప్పేదంతా వినాలని, అప్పుడే వారు పూర్తిగా మీడియటర్ మధ్య నమ్మకం పెరుగుతుందని అన్నారు. అలా చేయడం వల్ల వీరి మధ్య మంచి సమాచారం అందుతుందని అన్నారు.


మాట్లాడుతున్న శశీదేవి

వారి బాధలన్నీ సవివరంగా విని వాటిని విశ్లేషించడానికి మధ్యవర్తికి దోహదపడుతుందని తెలిపారు. మధ్యవర్తిత్వ న్యాయవాదులకు పూర్తిగా అర్థమయ్యే విధంగా పవర్‌పాయింట్‌ని ఉపయోగించి తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ ఆర్.సన్యాసినాయుడు, జి.శశీదేవి, సీనియర్ ట్రైనర్, తమిళనాడు సుదర్శన సుందర్ పాల్గొన్నారు.


చిన్నారి తల్లిదండ్రులతో డాక్టర్ లక్ష్మీనారాయణ

అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

శ్రీకాకుళం అర్బన్ : అరుదుగా కనిపించే మైలో మెనింగోసీల్, మెనింగో సీల్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి నగరంలోని లక్ష్మీనారాయణ సూపర్ స్పెషాలటీ ఆస్పత్రిలో క్రిటికల్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. న్యూరో సర్జన్ డాక్టర్ పైల లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన మంగళవారం ఈ శస్త్ర చికిత్స చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెన్నుముకలోని ఎముకల కలయికలో లోపం వల్ల అబ్ నార్మాలిటీ ఏర్పడి ఎముకుల మధ్య దూరం పెరుగుతుందన్నారు. ఆ సమయంలో వెన్నుపాములో నీరు (జూఫీ) సెరిబ్రోస్పైనల్ ఫ్లూయిడ్, మెనింజెస్ నాడీమూలకణాలల్లో వెన్ను కణితలకు సంబంధించిన స్పైనబైఫిడ వ్యాధిలోని ఇదొకరమన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా నడుము బాగాన వస్తుందని, కొందరిలో అరుదుగా మెడ, ఛాతి భాగాల్లో వస్తుంటుందని వివరించారు. ఈ వాధి సాధారణంగా నాలుగు రకాలుగా వస్తుందని తెలిపారు. సకాలంలో శస్త్ర చికిత్స అందించకపోతే కాళ్లు చచ్చుబడి ఇతర ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని వివరించారు. ఎటువంటి హాని లేకుండా ఇటువంటి అరుదైన శస్త్ర చికిత్సను అందించడం ఎంతో సంతృప్తిగా ఉందని అన్నారు.

ఆర్‌టిసి బస్సు పునరుద్ధరణ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

మెళియాపుట్టి: మండలంలోని టెక్కలి-పెద్దలక్ష్మీపురానికి ఆర్‌టిసి బస్సును అధికారులు బుధవారం పునరుద్ధరించారు. 'ప్రజాశక్తి'లో ఈ నెల 17న బస్సు పునరుద్ధరించాలని కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఆర్‌టిసి అధికారులు స్పందించారు. దీంతో బుధవారం టెక్కలి-పెద్దలక్ష్మీపురానికి బస్సును పునరుద్ధరించారు. ప్రయివేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్‌టిసి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయితే గ్రామానికి రాకుండా కిలోమీటర్ మేరకు మెయిన్ రోడ్‌లో నిలుపు వేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ రహదారి బిటి రోడ్డు వేశారని, గ్రామంలోకి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

'నీలమణి' హుండీ ఆదాయం లెక్కింపు

పాతపట్నం : పాతపట్నం నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ హుండీ బుధవారం లెక్కించారు. 43 రోజులకు రూ.6,37,167 ఆదాయం వచ్చిందని ఇఒ టి.వాసుదేవరావు తెలిపారు. దేవాదాయ కమిషనర్ వారి ఆదేశాల మేరకు శ్రీకాకుళం అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం నుంచి జి.వి.బి.రవికుమార్ ఆధ్వర్యాన లెక్కింపు చేపట్టామన్నారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ కోడి సుదర్శనరావు, అర్చకులు పాల్గొన్నారు.


ఆదాయాన్ని లెక్కిస్తున్న అర్చకులు

క్రైమ్ కార్నర్


నుజ్జునుజ్జయిన లారీ

లారీలు ఢీ : ఇద్దరు మృతి


ప్రజాశక్తి- టెక్కలి రూరల్
మండలంలోని అక్కువరం జాతీయ రహదారి ఆగి ఉన్న లారీని మరో లారీ అతివేగంగా వచ్చిన వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా నుంచి కాకినాడ వైపు బియ్యంలోడుతో లారీ వెళ్తుంది. అక్కువరం వద్దకు వచ్చేసరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వెనుక ఉన్న లారీలోని అస్సాంకు చెందిన డ్రైవర్ అసర్‌అలీ (42), క్లీనర్ నూరల్ ఇస్లాం (35) లారీ కేబిన్ ఇరుక్కుని అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. దీంతో రెండు లారీలు నుజ్జయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ లక్ష్మి, ఎఎస్ఐ వెంకటరమణ, హేవే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బూర్జ : మండలంలోని మదనపురం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన సోహన్ గౌడ్ ప్లాసిక్ డబ్బాలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన సొంత వాహనంతో పాలకొండ వెళ్తుండగా మదనపురం వద్ద డబ్బాలను అమ్ముకోవడానికి తన వాహనం దిగుతున్నాడు. ఆమదాలవలస నుంచి వస్తున్న మరో వాహనదారుడు బలంగా ఢీకొన్నాడు. రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు 108లో రాగోలు జెమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. ఎస్ఐ జి.వి.ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమానుషం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


గాయపడిన మంగమ్మ

వివాహేతర సంబంధం అంటగట్టి వివాహితను ఆటోలో ఎక్కించి వీధుల్లో అవమానీయకర స్థితిలో తోటి మహిళలే దాడికి తెగబడ్డ ఉదంతం నగరంలోని దమ్మల వీధిలో చోటుచేసుకుంది. బుధవారం మధ్యాహ్నం సమయంలో జరిగిన ఈఘటన సినీఫక్కీలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... నగర శివారు ప్రాంతమైన నవభారత్ సమీపాన దాసరి మంగమ్మ తన ఇద్దరు పిల్లలతో కలిసి నివాస ముంటోంది. ఆమె గతంలో దమ్మల వీధిలో నివాస ముండేది. అయితే అదే వీధిలో తాను నివాస ముంటున్న ఇంటికి ఎదురుగా స్థానిక నాయకులుగా ఉన్న అల్లుబిల్లి రాధ తన కుమార్తె భవానితో పాటు నివాస ముంటోంది. తన అల్లుడు రాజశేఖర్‌తో ఇంటి ఎదురుగా నివాస ముంటున్న మంగమ్మ వివాహేతర సంబంధం పెట్టుకుందని బావించిన రాధ గతంలో మంగమ్మపై దురుసుగా ప్రవర్తించింది. నిస్సహాయస్థితిలో ఆమె నవభారత్ వద్ద ఇంటిని అద్దెకు తీసుకుని వెళ్లి పోయింది. అయితే రాజశేఖర్‌తో ఆమె యథావిధిగా వివాహేతర సంబధాన్ని రాధ భావించింది. తన కుమార్తె భవానీతో కలిసి ఆటోలో నవభారత్ ప్రాంతానికి వెళ్లి మంగమ్మను అక్కడినుంచి దమ్మల వీధికి తీసుకొచ్చారు. అక్కడ ఆమెపై స్థానికుల సమక్షంలో దాడికి పాల్పడుతూ నానా దుర్భాషలాడారు. ఒంటిపై కారం చల్లి భౌతిక దాడులకు పాల్పడ్డారు. అనంతరం స్థానికుల సాయంతో ఆమెను హుటాహుటిన రిమ్స్‌కి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి కేసు నమోదు చేశారు. రాధ, ఆమె కుమార్తె భవాని, సహకరించిన ఆరుగురు మహిళలపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

8 మంది మహిళలకు గాయాలు

పలాస : కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. మండలంలోని రంగోయికు చెందిన వెలుగు మహిళలు త్రివేణి, వనజాక్షి, రవణమ్మ, వరలక్ష్మి, విజయ, మహాలక్ష్మి, దివ్య, మోహిని, శాంతమ్మలు కలిసి కాశీబుగ్గ గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు వెళ్లారు. డబ్బులు విత్ డ్రా చేసుకుని తిరిగి ఆటోలో వస్తున్నారు. కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రి సమీపంలో ఒక్కసారిగా ఎదురుగా ద్విచక్ర వాహనం రావడంతో అదుపు చేసే సమయంలో ఆటో బోల్తా పడింది. దీంతో ఎనిమిది మహిళలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పలా స ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రులకు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు.

తప్పిన ప్రమాదం

సరుబుజ్జిలి : మండల కేంద్రమైన సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ సమీపంలో బుధవారం ఓ ఇసుక లారీకి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఒడిశా నుంచి విశాఖపట్నం వైపు ఇసుకతో వెళ్తున్న భారీ లారీ అలికాం బత్తిలి రహదారిపై ఉన్న వంతెన తప్పించబోయి ఒకసారి రోడ్డును విడిచి పక్కకు ఒరిగిపోయింది. ఇంతలో డ్రైవర్ అప్రమత్తమై రోడ్డు పక్కన ఉన్న చెరువులో లారీ పడిపోకుండా చాకచక్యంగా రహదారిపైకి తీసుకురావడానికి ప్రయత్నించారు. ఇంతలో మట్టిలో కూడుకుపోయి లారీ నిలిచిపోయింది. రోజూ ఇదే ప్రాంతంలో ఇసుక లారీలు గుంతల్లో కూరుకుపోయి ప్రధాన రహదారి పక్కన లారీ నిలిచిపోతుండడంతో ట్రాఫిక్ స్తంభిస్తుంది. దీంతో ప్రజలు వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


రోడ్డు పక్కకు ఒరిగిన లారీ

కిట్లు పాఠశాలలకే అందించాలి



నినాదాలు చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కవిటి
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే స్టూడెంట్ కిట్లు నేరుగా పాఠశాలలకే అందించాలని యుటిఎఫ్ మండల అధ్యక్షుడు జానకిరావు డిమాండ్ చేశారు. మండలంలోని జాడపూడి ఆర్ఎస్‌లో యుటిఎఫ్ మండల కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నంబరు 117ను రద్దు చేయాలని తీర్మానించారు. అలాగే స్టూడెంట్ కిట్లు నేరుగా పాఠశాలలకు ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు సొంత డబ్బులతో మండల కేంద్రానికి వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడు తుందని సభ్యులు తెలిపారు. ఈ పరిస్థితిని జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు తీవ్రంగా ఖండించారని, ఇకనైనా విద్యార్థులు ఉపాధ్యాయుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని నేరుగా పాఠశాలలకే కిట్లు అందించాలని సభ్యులు కోరారు. అనంతరం ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ.మురళీప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఆర్.జగదీష్, కోశాధికారి మనోజ్ మహారాణ, గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- పలాస
పలాస మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్మన్ బల్ల గిరిబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయనకు ఎమ్మెల్యే గౌతు శిరీష కేక్‌ను కట్ చేసి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, జోగ మల్లి, సప్ప నవీన్, దువ్వాడ శ్రీకాంత్, వైస్ చైర్మన్లు బోర బుజ్జి, మీసాల సురేష్‌బాబు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, డిఇ కనకరాజు, ఎఇ అవినాష్ పాల్గొన్నారు.


కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే శిరీష

చెరువులే క్రీడా మైదానాలు


చెరువులో క్రికెట్ ఆడుతున్న యువకులు

వజ్రపుకొత్తూరు: యువత క్రీడలు వైపు మొగ్గు చూపుతున్నారు. అవకాశాలు కల్పిస్తే క్రీడా రంగంలో సత్తా చాటుతాం అనే అభిలాష యువతలో కనిపిస్తుంది. అయితే అందుకు తగిన ప్రోత్సాహం కొరవడుతుంది అనే విమర్శ ఉంది. పాఠశాలలకు సైతం సరియైన క్రీడా మైదానాలు లేవు. గ్రామీణ ప్రాంతాల్లో యువత అందివచ్చిన ప్రతి అవకాశమూ సద్వినియోగం చేసుకుంటున్నారు. యువతకు ప్రోత్సాహం లేకపోయినా ఉత్సాహం తగ్గలేదని తమకు తాము నిరూపించుకుంటున్నారు. కిడిసింగి చెరువును క్రీడా మైదానంగా చేసుకొని యువకులు మంగళవారం క్రికెట్ ఆడుతున్నారు. ప్రస్తుతం వేసవి ఎండలకు చెరువుల్లో నీరు కూడా లేకపోవడం యువత క్రీడా మైదానంగా చేసుకొని ఆటలు ఆడుకోడానికి ఉపయోగపడుతుంది. వర్షాలు కురిసి చెరువులు నిండిపోతే క్రీడల ప్రాక్టీసుకు దూరమవుతామని యువత చెబుతుంది. క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తే యువత తమలోని నైపుణ్యానికి పదును పెట్టే అవకాశం కలుగుతుందని, ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేయాలని క్రీడా ప్రేమికులు కోరుతున్నారు.


సంతబొమ్మాళి : పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి
సంతబొమ్మాళి మండలం మేఘవరం పంచాయతీ సూరాడవానిపేటలోని ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు తెలుగు యువత మండల ఉపాధ్యక్షులు బుధవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ ధనరాజు, మరువాడ సొసైటీ ప్రెసిడెంట్ సూరాడ జోగారావు, చెంచయ్య, ఉపాధ్యాయులు ఎం.రవికుమార్, దుర్గారావు సూరాడ ధనరాజు బైపల్లి కుమారస్వామి పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని తోలాపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను ఎంపిటిసి పప్పల కళ్యాణి పంపిణీ చేశారు. విద్యార్థులకు సంబంధించి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, బ్యాగ్‌లతో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.సత్యరాజ్, వైస్ ప్రెసిడెంట్ పప్పల శ్రీనివాసరావు, పిఎంసి చైర్మన్ పాత్రుని కుసుమ, మాజీ సర్పంచ్‌లు పొన్నాడ రామారావు, దుంపల సత్యం, ఎంపిటిసి మాజీ సభ్యులు పప్పల అప్పలనాయుడు, పొన్నాడ గంగాధరరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని శ్రీనివాసాచార్యులపేట పాఠవాలలో సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణంలోని పదో వార్డు హడ్కో కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లను టిడిపి నాయకులు నాగళ్ల మురళీధర్ పంపిణీ చేశారు. అలాగే మండలంలోని రామచంద్రపురంలో టిడిపి నాయకుడు ఇప్పిలి కోటేశ్వరరావు కూడా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

కోటబొమ్మాళి: మండలంలోని బాలుర, బాలికల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం పాఠ్యపుస్తకాలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు పంపిణీ చేశారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని పలువురు సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంద రోజుల పని తప్పనిసరి


మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి

కవిటి: అర్హులైన ప్రతిఒక్కరికీ వందరోజుల పని తప్పనిసరిగా కల్పించాలని, అదేవిధంగా ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు ఉపాధి కల్పనలో ప్రాధాన్యత కల్పించాలని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎన్ఆర్‌జిఎస్ క్షేత్ర సహాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యానవన పంటలకు సంబంధించి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారుల జాబ్‌కార్డులు అప్‌డేట్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎపిఒ మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల పారిశుధ్య పనులు

పొందూరు : మండలంలోని రాపాకలో సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు పర్యవేక్షణలో బుధవారం పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలోని పాఠశాల నుంచి శ్రీకాకుళం వెళ్లే రహదారిలో ఇరువైపులా పేరుకుపోయిన చెత్తా చెదారాలను, పిచ్చిమొక్కలను ప్రొక్లెయినర్‌తో తొలగించి శుభ్రపరిచారు. రోడ్డు పక్కన చెత్తాచెదారాలు వేయరాదంటూ స్థానికులకు తెలిపారు.

దోకులపాడు...
వజ్రపుకొత్తూరు : మండలంలోని దోకులపాడులో పారిశుధ్య పనులు నిర్వహించారు. కాలువలను శుభ్రం చేస్తూ చెత్తను తొలగించారు. వీధుల్లో, కూడళ్లలో ఉన్న చెత్తను తొలగించి బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ పనులను స్థానిక సర్పంచ్ వడ్డి కరుణాకర్, ఎంపిడిఒ తిరుమలరావు, కార్యదర్శి యాదవరాజు పరిశీలించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.


పొందూరు : చెత్తను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

ఎన్నాళ్లీ నరక ప్రయాణం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి
సరుబుజ్జిలి మండల ప్రధాన రహదారి అలికాం-బత్తిలి రహదారిపై ఎన్నాళ్లీ నరక ప్రయాణం అంటూ పలువురు వాహనదారులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సరుబుజ్జిలి నుంచి ఎల్ఎన్‌పేట, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, ఒడిశా రాష్ట్రం వైపు, అలాగే ఇటు ఆమదాలవలస, శ్రీకాకుళం వైపు ఈ ప్రధాన రోడ్డుపై నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఇంత ప్రాధాన్యత గల రోడ్డుపై భవనాలశాఖ అధికారులు కనీస స్పందించకపోవడంపై ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సరుబుజ్జిలి కూడలి నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఉన్న ప్రధాన రహదారిలో భారీ గోతులు ఏర్పడి మూడేళ్ళ కావస్తుంది. సాధారణ పూడ్చివేత పనులు కూడా సంబంధిత రోడ్లు భవనాలుశాఖ చేపట్టకపోవడంతో రోజూ భారీ వాహనాలు గోతుల్లో ఇరుక్కొని ట్రాఫిక్ స్తంభించడం నిత్యకృత్యంగా మారిందిని పలువురు వాపోతున్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి విశాఖపట్నం వైపు వందలాది భారీ ఇసుక లారీలు వెళ్తున్నాయి. ఇటీవల భారీ ఇసుక లారీ కూరుకుపోవడంతో 24 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆ లారీని బయటకు తీసేందుకు మూడు ప్రొక్లెయిన్లతో శ్రమించాల్సి వచ్చింది. అలాగే స్థానిక పోలీసులు మట్టి ఇసుక గ్రావెల్‌ను ఉపయోగించి స్వచ్ఛంద సేవలు చేపట్టారు. కానీ, కొద్ది రోజులకేౕరీ వాహనాల రాకపోకలు, అప్పుడప్పుడు కురిసిన వర్షాలకు గ్రావెల్ కొట్టుకుపోవడంతో గోతులు మరింత ఎక్కువయ్యాయి. గత ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం వహించడమే ప్రస్తుత రహదారుల దుస్థితికి కారణమని వాహనదారులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి ప్రధాన రహదారి దుస్థితిని చక్కదిద్ది నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వాహనాలు

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణిలు కేక్‌ను కట్ చేశారు. అనంతరం పేదలకు పళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేసిన ఆయన ఉత్తరాధి రాష్ట్రాల్లో పార్టీ పటిష్టత కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రామ్మోహనరావు, పిసిసి ప్రధాన కార్యదర్శి అంబటి కృష్ణారావు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు డి.గోవిందమల్లిబాబు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, జి.పి.నాయుడు, దీర్ఘాసి వెంకట్రావు, ఎం.అప్పన్న పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఆల్ ఇండియా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నియోజకవర్గ కో-ఆర్డినేటర్ అలీమ్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పేదలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు చాట్ల అజిత్‌కుమార్‌రెడ్డి, ఎన్.ధర్మ, ముకుంద, గోపి పాల్గొన్నారు.



ఆమదాలవలస : కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పిపిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు ఆధ్వర్యాన నిర్వహించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, ఆటో స్టాండ్ వద్ద కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో లఖినేని నారాయణరావు, బొత్స వెంకటరమణ, లఖినేని సునీల్‌కుమార్, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, దాలయ్య, పూజారి త్రినాథ్ పాల్గొన్నారు.

టీ షర్ట్స్ చేరిక

రణస్థలం రూరల్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ కొత్తకోట్ల సింహాద్రినాయుడు, రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షులు కొత్తకోట్ల లక్ష్మిలకు స్పీడ్ పోస్టు ద్వారా బుధవారం టీ షర్ట్స్ అందాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్ న్యాయ యాత్ర ఎపిలోని కర్నూలు జిల్లాలో 2022 అక్టోబరు నెలలో ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పలు ప్రాంతాల్లో భారత్ జోడో యాత్ర సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో మేము పాల్గొని రాహుల్‌గాంధీతో కలిసి పాద యాత్ర చేశామన్నారు. రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా పార్టీ అధిష్ఠానం నుంచి స్పీడ్ పోస్ట్ ద్వారా భారత్ జోడో న్యాయ యాత్ర టీ షర్ట్సును ఈ నెల 19న జె.ఆర్.పురం పోస్ట్‌మెన్ చేతులు మీదుగా అందుకున్నామని తెలిపారు. అనంతరం రాహుల్‌గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు, కృత్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి

కోటబొమ్మాళి: ఈ నెల29న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విదంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్ ప్రసన్నలత అన్నారు. కోర్టు ఆవరణలో అమె న్యాయవాదులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ కేసులు ముందుగానే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసరావు, కార్యదర్శి తిరుమలరావు, న్యాయవాదులు నరసింహమూర్తి, ఎజిపి సంపత్‌రావు, తిరుపతి, బి.ధర్మారావు, వై.వెంకట్రావు, శ్రీధర్‌రాజు, ఎస్.అప్పలనాయుడు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న శైలజ

మంత్రికి శుభాకాంక్షలు

కోటబొమ్మాళి: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం నిమ్మాడ తన స్వగృహంలో టెక్కలి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షులు, హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్, న్యాయవాధి పూజారి శైలజ మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు డోకి రమణమూర్తి, ఉప్పాడ జయరాం, కోట నాగేశ్వరరావు, డోకి గౌరి, బమ్మిడి పాల్గొన, ఉప్పాడ బాలబాస్కరరావు, అభిమానులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సురేష్

భూ సర్వేలో తప్పులు ఉండవు

ప్రజాశక్తి- పోలాకి

భూ సర్వేలో ఎప్పుడూ తప్పులు ఉండవు అని, అధునాతనమైన సాంకేతిక పరికరాలతో సర్వే నిర్వహిస్తున్నామని జిల్లా సర్వేయర్ కె.సురేష్ అన్నారు. మండలంలోని కొండలక్కివలసలో ఇటీవల వారణాసి రమేష్ ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుడు ఇచ్చిన సర్వే నంబరులోని విస్తీర్ణం మేరకు కొలతలు వేసి ఆయనకు అప్పగించారు. అలాగే ఇరు గ్రూపుల వారు తెలిపిన అభిప్రాయాలు మేరకు భూమి కొలతలు వేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీరామ్మూర్తి, విలేజ్ సర్వేయర్ అమ్మన్నాయుడు, విఆర్ఒ చక్రధర్ పాల్గొన్నారు.

సూర్యారావుకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా డాక్టర్ ఎన్ని సూర్యారావు నియామకంపై ఎపి బిసి న్యాయవాదుల అసోసియేషన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరంలోని ఓ ప్రయివేటు భవనంలో బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. జిల్లాలో ఉత్తమ స్విమ్మర్స్‌ను తయారు చేసి వారిని ఒలంపిక్స్ పోటీల స్థాయికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, పి.లక్ష్మీపతి, ఎన్ని రమేష్, జి.మన్మథరావు, బి.అప్పలనాయుడు, బి.వి.రమణ, పి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



విచారణ చేస్తున్న సుజాత

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో సీనియర్ సహాయకునిగా పనిచేస్తున్న జి.వి.ఎల్.ఎన్ కృష్ణమాచార్యులపై వచ్చిన అభియోగాలపై దేవాదాయశాఖ రీజనల్ డిప్యూటీ కమిషనర్ సుజాత బుధవారం విచారణ చేపట్టారు. ఆలయంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో స్వీపరు మొదలు పలు కేడర్లలో పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయిస్తామని, ఆలయంలో ఓ అర్చకునితో కలిసి కృష్ణమాచార్యులు డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు రావడంతో సిబ్బంది ఒక్కొక్కరిని పిలిచి విచారణ చేశారు. 48 మంది నుంచి వివరాలను సేకరించారు. అనంతరం ఆయన్నుంచి డిప్యూటీ కమిషనర్, ఆలయ ఇఒ చంద్రశేఖర్ వివరణ కోరగా స్పందన లేదు. దీంతో అతన్ని అరసవల్లి విధుల నుంచి తప్పించి దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపించారు. విచారణలో జిల్లా దేవాదాయశాఖ అధికారి ప్రసాద్ పట్నాయక్, విశాఖపట్నం ఉప కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సవరకుమార్

ఎఎన్‌ఎంల నియామకాలపై హర్షం

మెళియాపుట్టి : ఎపి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గుమ్మడి సంధ్యారాణి మొట్టమొదటి సంతకం రాష్ట్ర గిరిజన సంక్షేమ వసతిగృహాల్లోని ఎఎన్‌ఎంల నియమకాలపై పెట్టడం హర్షనీయమని డిఎల్‌డిఒ జిల్లా అధ్యక్షులు సవరకుమార్ అన్నారు. ఈ మేరకు తన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆశ్రమ వసతిగృహాల్లోనూ, పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో ఎఎన్‌ఎం నియమకాలపై మంత్రి తొలి సంతకం పెట్టడం సంతోషకరమన్నారు. మంత్రి గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం ఆనందదాయకమన్నారు. ఇదే విషయంపై గత ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ప్రయోజనం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లగా ఈ పోస్టులు భర్తీ కాలేదన్నారు. ఈయనతో పాటు నేషనల్ ట్రైబల్ ఫెరడేసన్ వైస్ ప్రెసిడెంట్ చౌదరి లక్ష్మణ్‌నారాయణ గిరిజన ఐక్యవేదిక మహిళా అధ్యక్షులు సవర హేమలత, డిఎల్‌ఒ ఉపాధ్యక్షులు సవర దేశాయ్, డిఎల్‌ఒ జనరల్ సెక్రటరీ సవర అశోక్, సవర చిన్నబాబు, సవర నాగేశ్వరరావు, సవర రామారావు, చల్ల శాంతారావు ఉన్నారు.

బాల్యం బడిలోనే...



తనిఖీ చేస్తున్న విజయ్‌కుమార్

కవిటి : 18 ఏళ్లలోపు బాల బాలికలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉండాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ్‌కుమార్ అన్నారు. బాల కార్మికుల గుర్తింపు, నియంత్రణలో భాగంగా కవిటి, సోంపేట మండలాల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రెండు మండలాల్లో పలు దుకాణ సముదాయాలు, వస్త్ర దుకాణాలు, బేకరీలు, భోజనశాలలు, బైక్ మెకానిక్ షెడ్లు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాల బాలికలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకుంటే ఎటువంటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. 18 ఏళ్ల లోపు బాల బాలికలు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ సామాజిక కార్యకర్త డి.మీనాక్షి, చైల్డ్‌హెల్ప్ లైన్ సూపర్ వైజర్ ఎస్.వైకుంఠరావు, సోంపేట ఎంఇఒ జోరాడు, ఎఎస్‌ఐ కుర్మారావు, ఐఇఆర్‌పి కృష్ణారావు, తేజావతి, బ్రెడ్స్ చైల్డ్ లైన్ మెంబర్ స్వాతి పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న గల్ఫ్ కార్మిక సంఘం ప్రతినిధులు

గల్ఫ్ కార్మికుల ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా తాము ఉన్నామంటూ గల్ఫ్ కార్మికులు ముందుకు వస్తున్నారు. మండలంలోని ఉద్దానం రామకృష్ణాపురానికి చెందిన పలువురు వ్యక్తులు గల్ఫ్ దేశాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. తమ గ్రామంలో ఎవరైనా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా, అనారోగ్యంతో బాధపడుతున్నా వారికి విషయం తెలిసిన వెంటనే ఆర్థికసాయాన్ని అందజేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన చిట్టి జానకమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న గల్ఫ్ కార్మిక సంఘం తమ వంతుగా రూ.87,551 చింత పద్మారావు చేతులు మీదుగా జానకమ్మకు బుధవారం అందజేశారు.

జాతీయ రచయితల సమ్మేళనం జిల్లా కన్వీనర్‌గా గౌరీశంకర్

శ్రీకాకుళం రూరల్ : డిసెంబరు 28,29 తేదీల్లో విజయవాడ కేంద్రంగా కృష్ణా జిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం సంయుక్తంగా 'జాతీయ తెలుగు యువ రచయితల సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ మేరకు జాతీయ రచయితల సమ్మేళనం జిల్లా కన్వీనర్‌గా గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ తెలుగు విభాగధిపతి భమ్మిపాటి గౌరీశంకర్‌ను నియమిస్తున్నట్టు వేదిక కన్వీనర్ జి.వి.పూర్ణచంద్ బుధవారం తెలిపారు. జిల్లాలో వివిధ పాఠశాలలు, కళాశాలలు, విశ్వావిద్యాలయాల విద్యార్థులు, 40 ఏళ్లలోపు ఉన్న రచయిత, రచయిత్రిలు ఇందులో పాల్గొనవచ్చని అన్నారు. విద్యార్థులకు ఎటువంటి రుసుం లేదని, ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 9492858395 నంబరు తెలుసుకోవచ్చాన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు మాధురి

ఆమదాలవలస : మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సికిల్ సెల్ ఎనీమియాపై డాక్టర్ సిహెచ్.మాధురి అవగాహన కల్పించారు. మండలంలోని దూసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న స్వయంశక్తి సంఘ సభ్యులకు వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు ఆధ్వర్యాన బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాధి లక్షణాలు రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోనికి మారడం, తీవ్ర కీళ్లనొప్పులు, ఒంటి నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచుగా వచ్చే అంటూ వ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు తదితర ఇబ్బందులు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ చందర్రావు, విఒఎలు సునీత, సువర్ణ, పావని, వైద్య సిబ్బంది శ్రీనివాసరావు, చౌదామని, ప్రభాకర్ పాల్గొన్నారు.

మొక్కలతోనే భూమికి రక్షణ

రణస్థలం: పుట్టిన రోజు వేడుకల్లో కేకులు కత్తిరించడానికి బదులు ప్రకృతిని పరిరక్షించే సంప్రదాయాన్ని బాల్యదశ నుంచే అలవాటు చేయాలని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. హరిత సొసైటీ కన్వీనర్ రొంగలి హరిబాబు, భవాని దంపతుల కుమార్తె లేఖ్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా కోష్ట సుబ్రమణ్య స్వామి ఆలయం ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటారు.